సాక్షి
తూర్పుగోదావరి
శుక్రవారం । 26 । సెప్టెంబర్ । 2025



రూ.లక్ష విరాళం

కొత్తపేట: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నప్రసాద భవనానికి పీవీ సీతా రామశాస్త్రి, సుజాత దంపతులు (ముమ్మిడివరం) రూ.1,00,116 విరాళం సమర్పించారు.



బంగారు లోలకుల సమర్పణ

రాజానగరం: చక్రద్వారబంధం దేవీచౌక్‌లో కొలువుతీరిన దుర్గామాతకు గ్రామానికి చెందిన భూపంశెట్టి నాగేశ్వరరావు దంపతులు 8 గ్రాముల బంగారు చెవి లోలకులు సమర్పించారు.

కడలిలోకి 4.47 లక్షల క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గురువారం రాత్రి 4,47,273 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,300, మధ్య డెల్టాకు 1,900, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.90 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

పంచారామాలకు ప్రత్యేక బస్సులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మూర్తి తదితరులు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): ఈ ఏడాది కార్తిక మాసంలో పంచారామ క్షేత్రాలను సందర్శించే భక్తుల కోసం రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి మూర్తి తెలిపారు. ఆ బస్సు సర్వీసుల పోస్టర్‌ను రాజమహేంద్రవరం డిపోలో గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ ప్రత్యేక ప్యాకేజీలో అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామ, సామర్లకోట క్షేత్రాలను దర్శించుకోవచ్చన్నారు. ఈ బస్సులు కార్తిక మాసంలో ప్రతి ఆదివారం రాత్రి 7 గంటలకు బయలుదేరి సోమవారం రాత్రి 10 గంటలకు తిరిగి డిపోకు చేరుకుంటాయని వివరించారు. చార్జీలు ఒక్కొక్కరికీ ఎక్స్‌ప్రెస్‌కు రూ.900, అల్ట్రా డీలక్స్‌కు రూ.1,100, సూపర్ లగ్జరీకి రూ.1,150గా నిర్ణయించామన్నారు. ఉద్యోగులు, వ్యాపారుల కోరిక మేరకు ప్రతి శనివారం బయలుదేరి ఆదివారం సెలవు రోజున దర్శించేలా బస్సులు నడుపుతామన్నారు. అలాగే, శబరిమల యాత్రకు ఆడియో, వీడియో సౌకర్యంతో పాటు పుష్ బ్యాక్ సీట్లు కలిగిన సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతామని మూర్తి తెలిపారు. కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిపో మేనేజర్ ఒ.మాధవ, అకౌంట్స్ అధికారి మావుళ్లు, అసిస్టెంట్ మేనేజర్ అజయ్‌బాబు, పీఆర్‌ఓ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి



సచివాలయ ఉద్యోగులతో నిఖిల్‌కృష్ణ

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): సచివాలయ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని ఏపీ గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య వేదిక రాష్ట్ర సెక్రటరీ జనరల్ విప్పర్తి నిఖిల్‌కృష్ణ కోరారు. సచివాలయ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య వేదిక ఆధ్వర్యాన వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఆందోళన ఉధృతం చేయనున్నారు. దీనికి సంబంధించి రాజమహేంద్రవరంలోని సచివాలయ ఉద్యోగుల కార్యాచరణపై స్థానిక 48వ డివిజన్ సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు, సమయపాలన లేని టెలి కాన్ఫరెన్సులు, పదోన్నతులు, సర్వేలు, ఉద్యమ కార్యాచరణ తదితర అంశాలపై వార్డు కార్యదర్శుల అభిప్రాయం తీసుకున్నామని నిఖిల్‌కృష్ణ తెలిపారు. ఉద్యమ కార్యాచరణపై కూడా ఈ సందర్భంగా చర్చించామన్నారు. కార్యక్రమంలో ఐక్య వేదిక కో చైర్మన్ భార్గవ్ సుతేజ్ తదితరులు పాల్గొన్నారు.

ఇండియా స్కిల్స్ కాంపిటీషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం రూరల్: ఇండియా స్కిల్స్ కాంపిటీషన్‌లో ప్రతిభ చూపడానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువతీ యువకులు ఈ నెల 30వ తేదీలోగా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జీవీడీ మురళి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు ట్రేడ్‌ను బట్టి 16 నుంచి 25 సంవత్సరాల మధ్య వయస్సు వారు అర్హులన్నారు. పారిశ్రామిక అవసరాలను దృష్టిలో ఉంచుకొని.. గుర్తించిన 63 ప్రాధాన్య రంగాల్లో ప్రతిభ చూపే అవకాశాన్ని ఈ పోటీ కల్పిస్తుందన్నారు. ఎంపికైన యువత జిల్లా, జోన్, రాష్ట్ర, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ చాటుకునే అవకాశం పొందుతారని వివరించారు. యువతలో నైపుణ్యాభివృద్ధి, వృత్తి విద్య, శిక్షణకు కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మేరా యువ భారత్ కార్యకర్తలు, ఐటీఐలు, డిప్లొమా/పాలిటెక్నిక్, డిగ్రీ కాలేజీలు తమ ఆధ్వర్యంలోని యువతను ఈ పోటీలో భాగస్వాముల్ని చేయించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. https://www.skillindiadigital.gov.in/account/register?returnUrl=%2Findia-skills-2025 వెబ్‌సైట్‌లో పోటీ జరిగే ట్రేడ్‌ల వివరాలు, వయోపరిమితి వివరాలు ఉంటాయని, రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని మురళి తెలిపారు.

పట్టా ఫట్!

- పేదల సొంతింటి కలను చిదిమేస్తున్న సర్కారు
- ఇప్పటికే గృహ నిర్మాణాలపై నిర్లక్ష్యం
- పూర్తయిన ఇళ్లకు సైతం బిల్లులు ఇవ్వని దుస్థితి
- నిర్మాణాలు మొదలుపెట్టని స్థలాలపై కన్ను
- జల్లెడ పడుతున్న నేతలు
- కూటమి కార్యకర్తలకు కట్టబెట్టేందుకు వ్యూహం

సాక్షి, రాజమహేంద్రవరం: పేదల సొంతింటి కలను చిదిమేసేందుకు కూటమి ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోంది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ఉన్న అక్కసుతో నిరుపేదలకు అన్యాయం చేస్తోంది. గృహ నిర్మాణాలు ప్రారంభించలేదన్న నెపంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి పట్టాలు రద్దు చేసే దిశగా పావులు కదుపుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే రంగంలోకి దిగిన కూటమి నేతలు.. క్షేత్ర స్థాయిలో ఎక్కడ ఏ స్థలం ఖాళీగా ఉంది.. ఎవరెవరు ఇంకా ఇళ్లు కట్టలేదనే వివరాలు ఆరా తీస్తున్నారు. వాటిని ఎవరికి కేటాయించాలో.. ఆ క్రమంలో ఎంత కొల్లగొట్టాలో లెక్కలు వేసుకుంటున్నారు. ఇదే జరిగితే పేదల సొంతిటి కల.. కలగానే మిగిలిపోయే ప్రమాదం ఎదురు కానుంది. ప్రారంభం కాని గృహ నిర్మాణాలను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వమే.. సంబంధిత పట్టాలను రద్దు చేసే దిశగా అడుగులు వేస్తోందని తెలిసి లబ్ధిదారులు నివ్వెరపోతున్నారు. నిర్మాణాలు పూర్తయి పేదలు తమ సొంత ఇళ్లల్లోకి వెళితే.. గత ప్రభుత్వానికి పేరు వస్తుందనే దురుద్దేశంతోనే కూటమి సర్కారు ఇలాంటి చర్యలకు దిగుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

19,617 పట్టాలు రద్దు!

జిల్లావ్యాప్తంగా 19,617 మందికి సంబంధించిన ఇళ్ల స్థలాల పట్టాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయనుంది. దీంతో, ప్రభుత్వం స్థలం మంజూరు చేసినందన్న వారి ఆనందం ఆవిరి కానుంది. సొంతింటి కలకు వీరందరూ దూరం కానున్నారు. తమకు స్థలం ఉందని, రూ.5 లక్షలకు పైగా ఆస్తి ఉందన్న భరోసాతో పిల్లల చదువులు, పెళ్లిళ్లకు సైతం పలువురు అప్పులు సైతం చేశారు. కూటమి సర్కారు నిర్ణయంతో ప్రస్తుతం ఆ స్థలం చేజారిపోతుందని వారు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం పూర్తిగా సహకరించని పరిస్థితుల్లో గృహ నిర్మాణాలు ఏవిధంగా ప్రారంభించాలని ప్రశ్నిస్తున్నారు.

కూటమి వచ్చాక నిర్వీర్యం

వాస్తవానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ గృహ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ ఏడాది మార్చి తర్వాత పక్కా ఇళ్లకు కేంద్రం నిధులు నిలిపివేస్తుందని, ఆలోగా పూర్తి చేసుకోవాలని తొలుత టార్గెట్ పెట్టారు. కానీ, ఇళ్ల నిర్మాణ లక్ష్య సాధన దిశగా మాత్రం సర్కారు అడుగులు వేయలేదు. దీంతో, ఎక్కడి ఇళ్ల నిర్మాణాలు అక్కడే నిలిచిపోయాయి. అనేక కాలనీలు పిచ్చి మొక్కలతో నిండుతున్నాయి.

ఫలించని వంద రోజుల ప్రణాళిక

జిల్లావ్యాప్తంగా గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహించిన అధికార యంత్రాంగం ప్రభుత్వ ఆదేశాల మేరకు గత ఏడాది వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. గత ఏడాది డిసెంబర్ నెలాఖరుకు మొత్తం 4,875 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. కానీ, ఆ గడువు లోగా 331 మాత్రమే పూర్తి చేశారు. మిగిలిన 4,544 ఇళ్ల నిర్మాణాన్ని ఈ ఏడాది సంక్రాంతికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని, దాని సాధనలో విఫలమయ్యారు.



నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో పురోగతిలో ఉన్న గృహ నిర్మాణాలు

గత ప్రభుత్వంలో వేగవంతం

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 'నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు' పథకంలో జిల్లావ్యాప్తంగా గృహ నిర్మాణాలు వేగవంతంగా సాగాయి. ఇంటి పట్టాలు మంజూరు చేసిన వెంటనే యుద్ధప్రాతిపదికన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించేవారు. ఈ ప్రక్రియ నిరంతరాయంగా సాగడంతో అప్పట్లో గృహ నిర్మాణ పనుల్లో రాష్ట్రంలోనే జిల్లా ఆదర్శంగా నిలిచింది. దీనికి తోడు సకాలంలో బిల్లులు రావడంతో లబ్ధిదారులు కూడా త్వరితగతిన పనులు చేపట్టారు. లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు అప్పట్లో మూడు రకాల ఆప్షన్లు ఇచ్చారు. వారి అభీష్టం మేరకే నిర్మించుకునే అవకాశం కల్పించారు. పనులకు అవసరమైన సిమెంట్, ఇసుక, స్టీల్ అతి తక్కువ ధరకే గృహ నిర్మాణ శాఖ ద్వారా అందజేశారు. ఒక్కో ఇంటికి రూ.35 వేల చొప్పున బ్యాంకు రుణం సైతం మంజూరు చేశారు. యుద్ధ ప్రాతిపదికన ఇళ్ల నిర్మాణం ప్రారంభమై, నిరంతరాయంగా సాగింది. సకాలంలో బిల్లులు రావడంతో లబ్ధిదారులు త్వరితగతిన పనులు చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలోనే 25,316 ఇళ్ల నిర్మాణాలు అన్ని హంగులతో పూర్తయ్యాయి.

ప్రస్తుతం ఇలా..

జిల్లావ్యాప్తంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 'నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు' పథకంలో 431 లే అవుట్లలో 71,523 ఇళ్లు మంజూరయ్యాయి. అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటి వరకూ 33,479 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. సుమారు 38,044 ఇళ్లు పురోగతిలో ఉన్నాయి. వాటిలో అసలు నిర్మాణాలు ప్రారంభించనివి 19,617 ఉన్నాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. బిలో బేస్‌మెంట్ లెవెల్ 6,832, బేస్‌మెంట్ లెవెల్ 5,289, లింటల్ లెవెల్ 2,522, రూఫ్ లెవెల్ 1,128, ఆర్‌సీ లెవెల్‌లో 228 ఉన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం బిల్లుల మంజూరులో నిర్లక్ష్యం చూపుతూండటంతో గృహ నిర్మాణాలు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియక లబ్ధిదారులు అయోమయానికి గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇళ్ల నిర్మాణం చేపట్టని వారి పట్టాలు రద్దు చేస్తామంటూ కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలు వారిని మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి.



సమిశ్రగూడెంలో అర్ధాంతరంగా ఆగిన ఇంటి నిర్మాణం

జిల్లాలో మండలాల వారీగా రద్దయ్యే పట్టాలు

మండలం	రద్దయ్యే పట్టాలు
అనపర్తి	327
బిక్కవోలు	300
రంగంపేట	1,117
కోరుకొండ	271
రాజానగరం	726
సీతానగరం	309
రాజమహేంద్రవరం అర్బన్	3,838
గోకవరం	132
కడియం	908
రాజమహేంద్రవరం రూరల్	750
చాగల్లు	710
కొవ్వూరు	911
తాళ్లపూడి	1,156
కొవ్వూరు అర్బన్	463
నిడదవోలు	1,600
పెరవలి	281
ఉండ్రాజవరం	730
నిడదవోలు అర్బన్	769
దేవరపల్లి	2,616
గోపాలపురం	745
నల్లజర్ల	956

పర్యాటకాభివృద్ధికి విస్తృత అవకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కీర్తి

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలో పర్యాటకాభివృద్ధికి విస్తృత అవకాశాలున్నాయని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. గోదావరి తీరం, ప్రకృతి సౌందర్యం, కడియం నర్సరీలు, సాంస్కృతిక వారసత్వం, దేవాలయాలు పర్యాటకులను ఆకర్షిస్తాయని వివరించారు. పర్యాటక శాఖ సమన్వయంతో హౌస్ బోట్స్, క్రూయిజ్ అభివృద్ధి అంశాలపై హౌస్ బోట్స్ బిల్డర్లు, ఆపరేటర్లతో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి సంబంధించి ఎకో టూరిజం, అడ్వెంచర్ స్పోర్ట్స్, హేవలక్ బ్రిడ్జి, టెంపుల్ టూరిజం, కడియం నర్సరీల్లో పెద్ద ఎత్తున అవకాశాలున్నాయని వివరించారు. కడియంపులంక నర్సరీలు, పిచ్చుకలంక, గోదావరి ఘాట్లు, పోలవరం ప్రాజెక్ట్ పరిసర ప్రాంతాలు ఎకో టూరిజం, క్రూయిజ్, హౌస్ బోట్స్ కార్యకలాపాలకు అనువుగా ఉన్నాయని చెప్పారు. పోలవరం, కొవ్వూరు, నిడదవోలు, మునికూడలి, రాజమహేంద్రవరం తదితర ఘాట్లు టెంపుల్ టూరిజంతో ప్రత్యేక ప్రాధాన్యం పొందాయని చెప్పారు. ఈ మేరకు ప్రతిపాదనలు అందజేస్తే తగిన సహకారం అందిస్తామని తెలిపారు. 2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో జిల్లాలో పర్యాటకాభివృద్ధి మరింత ఉత్సాహం సంతరించుకుంటుందని, అంతర్జాతీయ స్థాయిలో సందర్శకులను ఆకర్షించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ కీర్తి సూచించారు. కేరళ నుంచి వచ్చిన బృందం క్షేత్ర స్థాయిలో పర్యటించి, తమ అభిప్రాయం తెలియజేసింది. కేరళ తరహా హౌస్ బోట్స్ అభివృద్ధికి గోదావరి తీరం అనుకూలంగా ఉందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో రాష్ట్ర పర్యాటక శాఖ జీఎం (వాటర్ ఫ్లీట్) నాంచారయ్య, జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం, ఇరిగేషన్ హెడ్ వర్క్స్ డిప్యూటీ ఈఈ బి.మూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ.. నమోస్తుతే..

దసరా మహోత్సవాల్లో నాలుగో రోజైన గురువారం రాజమహేంద్రవరం దేవీచౌక్‌లో బాలాత్రిపురసుందరీ అమ్మవారు మహాలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్మాత మూడు శక్తుల్లో ఒకటైన శ్రీమహాలక్ష్మి అమిత పరాక్రమం చూపి, హాలుడు అనే రాక్షసుడిని సంహరించింది. లోక స్థితికారిణి అయిన దుర్గమ్మను ధన, ధాన్య, ధైర్య, విజయ, విద్య, సౌభాగ్య, సంతాన, గజలక్ష్మిగా.. కోరిన వరాలను ప్రసాదించే అష్టలక్ష్మి రూపమైన అమృత స్వరూపిణి శ్రీమహాలక్ష్మిగా దర్శించుకోవడం వల్ల ఐశ్వర్యప్రాప్తి, విజయం లభిస్తాయని భక్తులు విశ్వసిస్తారు. అమ్మవారి దర్శనానికి ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, కుంకుమ పూజలు నిర్వహించారు.

– సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం)



దేవీచౌక్ దసరా ఉత్సవాల్లో శ్రీమహాలక్ష్మి అలంకరణలో బాలాత్రిపురసుందరీదేవి



భక్తుల పూజలందుకుంటున్న అమ్మవారు



పూజలకు తరలివచ్చిన భక్తులు

నేరం వారిది.. శిక్ష వీరికి..

- 'తమ్ముళ్ల' యూరియా దోపిడీ
- ఒమ్మంగి సొసైటీలో వెలుగు చూసిన బాగోతం
- 170 బస్తాలు పక్కదారి
- ఇద్దరు నేతల క్రియాశీలక పాత్ర
- చిరుద్యోగులను బలి చేసే యత్నం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: అధికార పార్టీ అండదండలుంటే చాలు తిమ్మిని బమ్మిని చేసేయవచ్చని తెలుగు తమ్ముళ్లు భావిస్తున్నట్టున్నారు. నేరం ఒకరిది.. శిక్ష మరొకరికి అన్న చందంగా.. యూరియా సరఫరాలో చేతివాటం చూపుతూ కింది స్థాయి సిబ్బందిని బలి చేస్తున్నారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్)లో తాజాగా ఇటువంటి ఉదంతం చోటు చేసుకుంది.

ఏం జరిగిందంటే..

ఒమ్మంగి సొసైటీకి రెండు విడతల్లో 90 టన్నుల యూరియా వచ్చింది. రెండో విడత వచ్చిన యూరియాలో ఆ సొసైటీకి చెందిన టీడీపీ ద్వితీయ శ్రేణి నేత ప్రోద్బలంతో సుమారు 170 బస్తాలను ఆ పార్టీ సానుభూతిపరులకు దోచి పెట్టేశారు. ఒకటి రెండు యూరియా బస్తాలు ఇవ్వడమే గగనమైన పరిస్థితుల్లో.. అధికారం అండ, అడిగేవారెవరున్నారనే తెగింపుతో ఏకంగా 170 బస్తాల యూరియాను పక్కదారి పట్టించేశారు. ఈ విషయం వెలుగులోకి రావడంతో వ్యవసాయ శాఖ కమిషనర్ దీనిపై విచారణకు ఆదేశించారు. ఆ మేరకు ఒమ్మంగి సొసైటీలో వ్యవసాయ అధికారులు విచారణ చేపట్టారు. మొత్తం నలుగురు అధిక మొత్తంలో యూరియా కొనుగోలు చేసినట్లు తేల్చారు. ఒకరు 50 బస్తాలు, మరో ముగ్గురు 40 బస్తాలు కలిపి మొత్తం 90 యూరియా బస్తాలు గద్దల్లా తన్నుకుపోయారని గుర్తించారు. పీఏసీఎస్ అటెండర్ రామకుర్తి వంశీ, సొసైటీ చిరుద్యోగి సుంకర గంగాధర రామారావుతో పాటు మరో ఇద్దరు బయటి వారు కలిసి మొత్తం 170 యూరియా బస్తాలు తీసుకు వెళ్లినట్టు అధికారులు తేల్చారు.



ఒమ్మంగి పీఏసీఎస్‌లో యూరియా కుంభకోణంపై దర్యాప్తు చేస్తున్న అధికారులు (ఫైల్)

అసలైన పెద్దలను తప్పించి..

అయితే, యూరియాను పక్కదారి పట్టించినట్లు గుర్తించిన నలుగురిలో ఇద్దరు అదే సొసైటీలోని చిరుద్యోగులని చెప్పడం పలు సందేహాలకు తావిస్తోంది. విషయం బయట పడటంతో అధికార పార్టీ నేతలు ఉన్నత స్థాయిలో ఒత్తిళ్లు తెచ్చి, కోటాకు మించి యూరియా బస్తాలను అడ్డగోలుగా తరలించుకుపోయిన అసలైన పెద్దలను తప్పించేసి, చిరుద్యోగులను బలి చేశారని ఒమ్మంగి రైతులు తూర్పార పడుతున్నారు. ఒమ్మంగి సొసైటీ, వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఉన్న ఇద్దరు టీడీపీ కీలక నేతలు కనుసన్నల్లోనే ఆ పార్టీ సానుభూతిపరులకు యూరియా దోచి పెట్టారని పలువురు చెబుతున్నారు. ఆ ఇద్దరు కీలక నేతలే ఈ యూరియా బాగోతంలో అసలైన దొంగలను తప్పించి, అమాయకులైన చిరుద్యోగులను బలి పశువులను చేశారని అంటున్నారు. సంఘానికి ఒకేసారి యూరియా భారీగా వచ్చింది. ఈ నేపథ్యంలో దీని విక్రయాలు క్రమపద్ధతిలో జరపలేని గందరగోళంలో ఎవరెంత తీసుకువెళుతున్నారో తెలియలేదని మరో కట్టుకథ కూడా అల్లారంటున్నారు. ఇదే కారణంతో యూరియా నిల్వలను ఆన్‌లైన్‌లో నమోదు చేయలేకపోయామంటూ వాస్తవాన్ని తొక్కిపెట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇతరుల పేరిట దోపిడీ!

మొత్తం 170 బస్తాల యూరియాను దారి మళ్లించడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన ఆ ఇద్దరు నేతలు ఇదే సొసైటీలో మరో పెద్ద కుంభకోణానికి కూడా పాల్పడ్డారని స్థానికులు చెబుతున్నారు. గ్రామంలోని పలువురి ఆధార్ కార్డులు సేకరించి, వారి పేరున పెద్ద ఎత్తున యూరియా దోచేసినట్టు బయటపడింది. అధికారులు గుర్తించిన దాని కంటే రెండుమూడు రెట్లు అధికంగా యూరియాను తెలుగు తమ్ముళ్లు దారి మళ్లించి సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. సొసైటీలో బస్తా రూ.266కు కొనుగోలు చేసి బ్లాక్‌లో రూ.350 నుంచి రూ.400కు అమ్మి వారు సొమ్ములు వెనకేసుకున్నారనే విషయం ఒమ్మంగిలో ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది.

ఇతర ప్రాంతాల్లోనూ ఇదే తీరు

కూటమి సర్కారుకు ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో ప్రస్తుత ఖరీఫ్‌లో అదునుకు యూరియా లభించక రైతులు నానా అగచాట్లూ ఎదుర్కొంటున్నారు. ముందుగా కూపన్లు ఇచ్చినా.. ఎన్నెకరాల భూమి ఉన్నా ఒక బస్తా యూరియా దొరికితే గొప్పే అన్నట్టుగా ఉంది రైతుల పరిస్థితి. సరిగ్గా ఇదే తరుణంలో తెలుగు తమ్ముళ్లు యూరియా అమ్మకాలను గుప్పెట్లో పెట్టుకుని రైతులను దోచుకుంటున్నారనే విమర్శలు జిల్లావ్యాప్తంగా వెల్లువెత్తుతున్నాయి. టీడీపీ సానుభూతిపరులకు బస్తాలకు బస్తాల యూరియాను గంపగుత్తగా తరలించేసి, సొమ్ము చేసుకున్న సంఘటనలు వివిధ మండలాల్లో ఇటీవల వెలుగు చూశాయి. దాదాపు అన్నిచోట్లా 'తమ్ముళ్ల' పెత్తనం మితిమీరి నడిచిందనే ఆరోపణలు వచ్చాయి. ప్రత్తిపాడు రూరల్, గండేపల్లి, జగ్గంపేట, గొల్లప్రోలు తదితర మండలాల్లో ఇందుకు బలం చేకూర్చే సంఘటనలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో పీఏసీఎస్‌కు కోటా ప్రకారం వచ్చిన 20 టన్నుల యూరియా అమ్మకాలను టీడీపీ నేతలు తమ చేతుల్లోకి తీసుకున్నారు. సుమారు 100 బస్తాలు పార్టీ సానుభూతిపరులకు దోచిపెట్టడం, రైతుల చేతుల్లో కూపన్లను బలవంతంగా లాగేసుకోవడం అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనమైంది. దీనిపై వైఎస్సార్ సీపీ గొల్లప్రోలు జెడ్పీటీసీ సభ్యుడు ఉలవకాయల లోవరాజు ఆధ్వర్యాన రైతులు రోడ్డెక్కారు కూడా.

అధిక వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి



రాజమహేంద్రవరం రూరల్: జిల్లావ్యాప్తంగా ఈ నెల 27వ తేదీ వరకూ అధిక వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని కలెక్టర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లోతట్టు భూభాగాలు, నదీ తీర ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉన్నందున క్షేత్ర స్థాయి అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లో 94932 06371, 99084 54580తో పాటు 24 గంటలూ పని చేసే టోల్ ఫ్రీ నంబర్ 1800-425-8585తో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజల నుంచి ఏవైనా ఫిర్యాదులొస్తే ఇక్కడి సిబ్బంది నమోదు చేసి, సంబంధిత విభాగాలకు తెలియజేయాలని ఆదేశించారు. విద్యుత్ స్తంభాలు, తెగిన వైర్లు, ముంపు నీటిలో నడవడం పూర్తిగా మానాలని కలెక్టర్ సూచించారు.

క్లుప్తంగా

గ్రామ స్వరాజ్య సాధనే లక్ష్యం

కొనసాగుతున్న ఎంపీడీఓల శిక్షణ



ఎంపీడీఓలకు శిక్షణ ఇస్తున్న రామచంద్రరావు

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాల్లో ఎంపీడీఓలకు నిర్వహిస్తున్న శిక్షణ కొనసాగుతోంది. 11 జిల్లాల్లో పదోన్నతి పొందిన ఎంపీడీఓలకు రెండో బ్యాచ్‌లో శిక్షణ ఈనెల 8వ తేదీన ప్రారంభించారు. అక్టోబరు ఏడో తేదీ వరకు శిక్షణ కొనసాగనుంది. పదోన్నతి పొందిన వారికి పంచాయతీరాజ్ చట్టంతో పాటు, జిల్లా పరిషత్, మండల పరిషత్ అధికారులు, ఎంపీటీసీ, సర్పంచ్, ఎంపీపీ విధులు, బాధ్యతలపై శిక్షణ పొందడంతో పాటు బడ్జెట్ తయారీ, మండల పరిషత్ సమావేశాల నిర్వహణ, పంచాయతీల తనిఖీ, గ్రామ సభల నిర్వహణ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు సంబంధించి శిక్షణ పొందుతున్నారు. దీనిలో భాగంగా పంచాయతీ రాజ్ కమిషనర్ నుంచి ప్రశంసలు అందుకున్న తాడేపల్లికి చెందిన పంచాయతీ కార్యదర్శిచే గురువారం ఎంపీడీఓకు శిక్షణ ఇప్పించారు. గ్రామ్ స్వరాజ్ అనే అంశంపై టి.రామచంద్రరావు శిక్షణ ఇచ్చారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

గుండెల్లో ఢీజే!





శబ్దాలు రెండు రకాలు. శ్రావ్యంగా ఉండి మనసును ఉల్లాసపరిచేవి.. ఫాస్ట్ బీట్‌తో తనువును ఉర్రూతలూగించేవి. పరిధి దాటనంత వరకూ ఈ రెండు సంగీత ప్రక్రియలనూ అందరూ ఆస్వాదిస్తారు. అది మీరితేనే సమస్య. ఇటు వాయించేవారికీ.. అటు వినేవారికి కూడా ప్రమాదమే. దీపావళి పండగ సందర్భాల్లో చాలా మటుకు కుక్కలు, పశువులు ఇతర జంతువులు బాణసంచా శబ్దాలు వినపడని స్థలాలను ఆశ్రయిస్తుంటాయి. ఇళ్లలో కుక్కలు, పిల్లులైతే ఏ చివరి గదుల్లోకో వెళ్లిపోయి మంచాల కింద, బీరువాల కిందా దాక్కుంటాయి. కారణం చిన్న పిన్ పడిన శబ్దాన్ని సైతం అవి వినగలవు కానీ.. పెద్ద శబ్దాలను తట్టుకోలేవు. మనుషుల పరిస్థితీ అంతే. పెద్ద శబ్దాలు ఎప్పుడూ గుండె లయ తప్పేలా చేస్తాయి. ఏ క్షణంలో ఆగిపోతుందా అనే పరిస్థితి ఉంటుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ వేడుకకైనా నిర్వాహకులు వినియోగించే డీజే శబ్దాలు ప్రాణాంతకంగా మారుతున్నాయి. ఎందరో గుండెల లయ తప్పకుండా ఉండాలంటే వాటి నియంత్రణ ఎంతో అవసరం.

- ప్రమాదకరంగా భారీ శబ్దాలు
- కుర్రకారులో విపరీత ధోరణి
- బలహీన గుండెలకు ప్రాణాంతకం
- మితి లేని శబ్ద కాలుష్యం
- నియంత్రణలో పోలీసులు విఫలం

అమలాపురం టౌన్: డీజేల మోత లేకుండా నేడు శుభాశుభ కార్యాలూ జరగడంలేదు. వివాహాది శుభకార్యాలు, జాతరలు, ఆధ్యాత్మిక, రాజకీయ ఊరేగింపులు, ఆఖరికి అంతిమ యాత్రల్లో సైతం అరుదుగా డీజేల మోత మోగిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చెలువులు చిల్లులు పడేలా.. గుండెలదిరిపోయేలా డీజేలు చేసే శబ్దాలతో కుర్రకారు హంగామా పరిపాటైపోయింది. ఒకటి కాదు.. రెండు కాదు ఏకంగా పదేసి బాక్సులతో ఓ పద్ధతిలో వాహనంలో అమర్చి ఊరేగిస్తూ వాటి ముందే కొందరు మందేసి చిందేస్తూ మరికొందరు మైమరచి పూనకం వచ్చినట్టు ఊగేస్తూ హడావిడి చేస్తున్నారు. జిల్లాలో ఇలా డీజే సౌండ్ సిస్టమ్‌లు నిర్వహించేవారు 180 వరకు ఉన్నారు. జిల్లా కేంద్రం అమలాపురం, రామచంద్రపురం, మండపేట పట్టణాలు, ముమ్మిడివరం నగర పంచాయతీ, రావులపాలెం, కొత్తపేట, రాజోలు, మలికిపురం, అంబాజీపేట తదితర ప్రాంతాల్లో వీరు కేంద్రీకృతమై ఉన్నారు.

నిబంధనలు ఏం చెబుతున్నాయి

- లిఖిత పూర్వక అనుమతులు లేకుండా లౌడ్ స్పీకర్లు, సౌండ్ బాక్సులు వాడకూడదు.
- బహిరంగ ప్రదేశాల్లో 10 డెసిబుల్స్‌కు మించి శబ్దం చేయకూడదు.
- వైద్య శాలలు, విద్యా సంస్థలు, దేవాలయాలు, న్యాయస్థానాలకు వంద మీటర్ల పరిధిలోని ప్రాంతాలు నిషిద్ధ ప్రాంతాల కేటగిరీలో ఉన్నాయి.
- నిషిద్ధ ప్రాంతాలుగా గుర్తించిన ప్రదేశాల్లో సంగీత ధ్వనులు, డ్రమ్స్ కొట్టడం, ఇతర శబ్దాలు చేయడం చట్ట విరుద్ధం.
- ప్రైవేటు ప్రదేశాలపై ఇళ్లు, హాళ్ల వద్ద డీజే శబ్దాలు చేయకూడదు.
- సినిమా థియేటర్లలో సైతం పరిమిత డెసిబుల్స్ శబ్దాలనే వినియోగించాలి.

డీజే పెను శబ్దానికి ఆగిన గుండె

గుండె బలహీనంగా ఉండేవారు, కాస్త పెద్ద వయసు కలకు ఈ భీకర శబ్దాల వల్ల ప్రాణాలకు హాని వాటిల్లే ప్రమాదం ఉంది. ఎప్పుడైనా ఓ చేదు అనుభవం జీవిత పాఠం నేర్పుతుంది. గత ఏడాది అమలాపురంలో జరిగిన దసరా ఉత్సవాల ఊరేగింపుల్లో ఏర్పాటు చేసిన డీజేల శబ్దాలకు రూరల్ మండలం బండార్లంకకు చెందిన 22 ఏళ్ల యువకుడి గుండె ఆగి మృతి చెందాడు. ఈ దుర్ఘటనతో పట్టణంలో డీజే శబ్దాలు కొంత తగ్గుతాయని అంతా ఆశించారు. ఆ తరువాత కూడా జిల్లాలో రెండు మూడు ఘటనల్లో డీజేల వల్ల ఇద్దరి వ్యక్తులు మృత్యువాత పడినా దానిని ఉత్సవాల నిర్వాహకులు, పోలీసుల ధ్రువీకరించకపోవడం వల్ల ఈ మృతులు డీజేల నుంచి తప్పించుకున్నాయి.

పోలీస్ చర్యలు అంతంత మాత్రమే

రోడ్లపై వెళ్లే వాహనాలు ఎక్కువ శబ్దాలతో వెళితేనే మనం తట్టుకోలేం. బాణసంచా కాల్పుల పెను శబ్దాలకు చెవులు మూసుకుని రక్షణ పొందుతాం. రోజంతా లేదా రాత్రంతా ఉత్సవాలు, ఊరేగింపుల్లో డీజేల మోత మోగిపోతుంటే ఎలా భరించగలం. కుర్ర కారు వికృతానందానికి ఇతరులు రాజీపడి పక్క నుంచి తప్పుకుని పోతున్నారు. డీజేల పెట్టకూడదని పోలీసుల ఆంక్షలు విధిస్తున్నా ఉత్సవాలు, ఊరేగింపుల నిర్వాహకులు వాటిని పెడచెవిన పెడుతున్నారు. పోలీసులు సైతం డీజే నిర్వాహకులపై తీసుకునే చర్యలు అంతంత మాత్రంగానే ఉంటుండడంతో వారిలో ఏ మాత్రం మార్పు రావడం లేదు. ఇటీవల జరిగిన వినాయక నిమజ్జనోత్సవ ఊరేగింపుల్లో పోలీసు ఆంక్షలను ఖాతరు చేయకుండా డీజేల మోత హోరెత్తింది. అమలాపురం పట్టణంలో ఒకట్రెండు చోట్ల డీజేలను పోలీసులు అదుపు చేసినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఆ హోరును ఆపగలిగే పరిస్థితి పోలీసులకు లేకుండా పోయింది.

డీజేల శబ్దాలతో గుండెకు ఇబ్బందే..



పెద్ద శబ్దాల డీజేలతో మనిషి గుండెకు ప్రతికూల పరిస్థితులే ఎక్కువగా ఉంటాయి. ఆరోగ్యవంతమైన గుండె కూడా పరిమితికి మించిన డీజేల శబ్దాలకు తీవ్రంగా ప్రతిస్పందిస్తుంది. ఇక ఏ మాత్రం గుండె బలహీనంగా ఉన్నా ఆ భారీ శబ్దాలకు ఆగిపోయే ప్రమాదమూ లేకపోలేదు. ఇలాంటి హృద్రోగులు డీజేల శబ్దాలకు పూర్తిగా దూరంగా ఉంటేనే శ్రేయస్కరం. మొత్తం మీద డీజేల శబ్దాలకు అన్ని వయసులు వారు దూరంగా ఉంటేనే ఆరోగ్యపరంగా మంచిది.

– డాక్టర్ కారెం రవితేజ, ఎండీ జనరల్ మెడిసన్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, అమలాపురం

జాతీయ సమైక్యతే లక్ష్యం



శిబిరం వివరాలు తెలియజేస్తున్న ఎన్‌సీసీ అధికారులు అగర్వాల్, మానిక్

రాజానగరం: యువతలో జాతీయ సమైక్యత, సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎన్‌సీసీ గ్రూప్, కాకినాడ కమాండర్ కల్నల్ ఎం.అగర్వాల్ అన్నారు. దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో 12 రోజుల పాటు నిర్వహించే ఎన్‌సీసీ జాతీయ సమైక్యత ప్రత్యేక శిబిరాన్ని గురువారం అగర్వాల్ ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలోని 17 ఎన్‌సీసీ డైరెక్టరేట్ల నుంచి 300 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారు. ఈ శిబిరంలో ఆటలు, పాటలు, వ్యక్తిగత, బృంద పోటీలు, విద్యా పర్యటనలు, ప్రేరణాత్మక ఉపన్యాసాలు, సామాజిక సేవా ర్యాలీలతో పాటు ‘ఎ డే ఎట్ సీ’ అనే ప్రత్యేకతతో కూడిన అనుభవపూర్వకమైన కార్యక్రమాలను నిర్వహిస్తారని ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కర్నల్ హెచ్.ఎస్.మానిక్ తెలిపారు.

ఉద్యోగావకాశాలపై రేపు ఓరియంటేషన్

రాయవరం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ఈ నెల 27న నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలపై ఓరియంటేషన్ నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని కాకినాడ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ ఎం.వేణుగోపాలవర్మ గురువారం పత్రికా ప్రకటనలో తెలిపారు. జర్మనీలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో అపారమైన ఉద్యోగావకాశాలు, వృత్తి మార్గాలపై ఆఫ్‌లైన్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని వారు ఈ కార్యక్రమానికి హాజరు కావాలన్నారు. ప్రభుత్వ శిక్షణ సంస్థలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. జర్మనీలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో ఉద్యోగం పొందాలనే ఆసక్తి ఉన్న యువత ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. బీటెక్ మినహాయించి గ్రాడ్యుయేషన్(జనరల్), డిప్లొమా, పాలిటెక్నిక్, ఇంటర్ ఉత్తీర్ణులై 18 ఏళ్ల నుంచి 28 ఏళ్ల వయస్కులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. శిక్షణ, జీత భత్యాలు, జర్మనీలో స్థిరపడే అవకాశాల గురించి నిపుణులు అవగాహన కల్పిస్తారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు బయోడేటాతో సకాలంలో హాజరుకావాలని ఆయన సూచించారు.

అరుణాం కరుణాంతరంగితాక్షీం

కలశాలతో 300 మంది మహిళల ప్రదర్శన



ఆకట్టుకున్న శక్తివేషాలు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం కోరుకొండ రోడ్డు వీవర్స్ కాలనీ సెంటర్‌లోని శ్రీ కనకదుర్గా సాయి మందిరం ఆధ్వర్యంలో సాగుతున్న దేవీ నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం 300 మంది మహిళలు కలశాలతో ఊరేగారు. వారి ముందు గరగ నృత్యాలు, శక్తి వేషాలు స్థానికులను ఆకట్టుకున్నాయి. ఆలయం వద్ద నుంచి సాగిన ఈ ప్రదర్శనలు రామకృష్ణ మఠం, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వరకు సాగి తిరిగి ఆలయానికి చేరుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఉత్సవ కమిటీ నిర్వాహకులు జొన్నాడ వీర వెంకట సుబ్బారావు శ్రీదేవి దంపతులు దుద్దుపూడి శ్రీనివాస్, పద్మావతి,బి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కలశాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

హెల్త్ క్లినిక్ శిలాఫలకం ధ్వంసం దుర్మార్గం

- మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు
- ఊనగట్లలో స్థలం పరిశీలన
- వైఎస్సార్ సీపీ శ్రేణుల నిరసన



శిలాఫలకం వద్ద ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పార్టీ శ్రేణులు

చాగల్లు: మండలం ఊనగట్లలో విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనంపై ఉన్న నవరత్నాల లోగోతో ఉన్న శిలాఫలకాన్ని దుండగులు ధ్వంసం చేయడం దుర్మార్గమైన చర్య అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఊనగట్లలో బుధవారం రాత్రి శిలాఫలకాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఈ భవనాన్ని గురువారం ఆయన పరిశీలించి పార్టీ శ్రేణులతో కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. టీడీపీ నాయకుడు, ఊనగట్ల సొసైటీ అధ్యక్షుడు బొల్లిన నాగేంద్ర ఈ లోగో తొలగించాలని బుధవారం సాయంత్రం ఆరోగ్య సిబ్బందిని బెదిరించినట్లు తలారి విమర్శించారు. నాగేంద్ర ప్రమేయంతోనే అతని అనుచరులు ఈ శిలాఫలకాన్ని ధ్వంసం చేసినట్లు స్థానికులు ఆయనకు చెప్పారు. రాజకీయాల్లో ఇటువంటి చర్యలు తగదని, ఎన్నికలప్పుడే తప్ప మిగతా రోజుల్లో రాజకీయ విద్వేశాలు లేకుండా కలిసిమెలిసి ఉండాలన్నారు. శిలాఫలకాన్ని పరిశీలించిన ఆయన పోలీసులకు ఫోన్‌లో సమాచారం అందించారు. 2014–19 వరకు టీడీపీ నాయకులు ఎన్నో దుశ్చర్యలకు పాల్పడ్డారని, తాము అటువంటి చర్యలకు ఎప్పుడూ పాల్పడలేదని గుర్తు చేశారు. ఇకపై వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించినా, వేధించినా సంబంధిత కూటమి నాయకులు, అధికారులపై చట్టరీత్యా శిక్షించేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్ డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మట్టా వీరాస్వామి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జుట్టా కొండలరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, సర్పంచ్ మట్టా వెంకట్రావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు వీరవల్లి కిశోర్, నాయకులు ఉప్పులూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఊనగట్లలో ధ్వంసమైన నవరత్నాల లోగో శిలాఫలకం

అక్రమ కబేళా గుట్టురట్టు

- నూనె, పశుచర్మాలతో పాటు గో మాంసం, మూడు ఆవులు స్వాధీనం
- ముగ్గురిపై కేసు నమోదు



కబేళాలో తనిఖీ చేస్తున్న అధికారులు

తుని: పట్టణ శివారులో అక్రమంగా నిర్వహిస్తున్న పశు కబేళాపై పట్టణ పోలీసులు దాడి చేశారు. వివరాల్లోకి వెళితే.. స్థానిక రామకృష్ణాకాలనీ శివారులో షంషీర్ అనే వ్యక్తి పశువులను కోసి అక్రమ కబేళా నిర్వహిస్తూ పశువుల కొవ్వు, చర్మాలతో నూనె తయారు చేస్తున్నాడు. సమాచారం అందుకున్న జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఆదేశాల మేరకు గురువారం పట్టణ సీఐ గీతారామకృష్ణ సిబ్బందితో కలిసి కబేళాపై దాడి చేశారు. ఈ దాడుల్లో ఎనిమిది టిన్నుల ఆయిల్, 40 పశు చర్మాలు, భారీగా గో మాంసం, మూడు గోవులను స్వాధీనం చేసుకున్నారు. ఆవులను గోశాలకు తరలించి కబేళా అక్రమంగా నిర్వహిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రామకృష్ణ తెలిపారు. కబేళా నిర్వహిస్తున్న వ్యక్తి గతంలో కూడా ఇలాగే చేస్తూ అధికారులకు పట్టుబడి మానేసాడని, ఇటీవల తన వ్యాపారాన్ని తిరిగి ప్రారంభించినట్లు గుర్తించామని సీఐ వివరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో జరిమానా

రాజమహేంద్రవరం రూరల్: మద్యం తాగి వాహనాలు నడిపిన 51 మందికి రూ.10 వేల చొప్పున జరిమానా, ఆరుగురికి రెండు రోజులు, ముగ్గురికి మూడు రోజుల జైలు శిక్ష విధిస్తూ గురువారం మూడో అదనపు జిల్లా ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సి.రమ్య తీర్పు ఇచ్చారు. జిల్లా ఎస్పీ బి.నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు రాజమహేంద్రవరం ట్రాఫిక్ సీఐ నబీ ఆధ్వర్యంలో 60 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి, న్యాయమూర్తి ముందు హాజరుపరచారు. దీంతో ఆమె పై విధంగా తీర్పు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు.

ముగిసిన జాతీయ సదస్సు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర – వికసిత్ భారత్ 2047పై రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ప్రొఫెసర్ భానుప్రసాద్ భవిష్యత్ భారత్‌పై వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు ప్రపంచ నాయకత్వాన్ని వివిధ రంగాల్లో సాధించడం, రాజధాని ప్రాధాన్యం అంశాలను విశదీకరించారు. ఇందులో భాగంగా 123 పేపర్ ప్రజంటేషన్లు చేశారు. సదస్సు డైరెక్టర్ కె.లక్ష్మణ రావు, బిలాస్‌పూర్ యూనివర్సిటీ ప్రొఫెసర్ బి.వెంకటేశ్వరరావు, ఎం.శరత్, వైస్ ప్రిన్సిపాల్ సంజీవ్‌కుమార్ పాల్గొన్నారు.

వరల్డ్ సైంటిస్టుల జాబితాలో స్థానం



ఆర్.శ్రీనివాసరావు



బత్తుల తిరుమలకృష్ణ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ సంస్థ ఎల్సివీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2025 వరల్డ్ సైంటిస్ట్ జాబితాలో జేఎన్‌టీయూకే ప్రొఫెసర్లు ఇద్దరికి స్థానం దక్కింది. ఇన్ఫర్మేషన్ కమ్యూనికేషన్ టెక్నాలజీ విభాగంలో ఎనర్జీ, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అండ్ ఇమేజ్ ప్రాసెసింగ్‌లో సబ్ కేటగిరీలో స్థానం లభించింది. ఈఈఈ ప్రొఫెసర్, జేఎన్‌టీయూకే రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావుకు 6,975వ స్థానం, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ప్రొఫెసర్ బత్తుల తిరుమలకృష్ణకు 8,545 స్థానం దక్కింది. వీరు 100కు పైగా జర్నల్స్ ప్రచురించారు. జేఎన్‌టీయూకే వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్, డైరెక్టర్లు అభినందించారు.

జాతీయ క్రికెట్‌కు రాజమహేంద్రవరం న్యాయవాదులు



క్రికెట్ టోర్నీకి ఎంపికైన న్యాయవాదులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): న్యూఢిల్లీలో శనివారం నుంచి అక్టోబర్ రెండో తేదీ వరకు జరగనున్న జాతీయ న్యాయవాదుల క్రికెట్ టోర్నీకి రాజమండ్రికి చెందిన న్యాయవాదులు ఎంపికయ్యారు. వారిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తన కార్యాలయంలో గురువారం అభినందించారు. ఈ పోటీలకు పోతుల కృష్ణారావు, ఇనుమర్తి ప్రభాత్, బ్రహ్మజ్యోస్యుల ఫణికుమార్ ఎంపికయ్యారు. నవ్యాంధ్ర అడ్వకేట్ క్రికెట్ అసోసియేషన్ స్టేట్ జనరల్ సెక్రటరీ నరాల రమణమూర్తి, రాజమండ్రి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శోభనాద్రి, ప్రధాన కార్యదర్శి పెల్లూరి రమేష్, ఉపాధ్యక్షులు ఆల్లంపల్లి రామకృష్ణ, బార్ కౌన్సిల్ సభ్యుడు ముప్పాళ్ల సుబ్బారావు, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శి గెడ్డం రాజకుమార్ పోటీలకు ఎంపికైన న్యాయవాదులకు అభినందనలు తెలిపారు.

రాళ్లతో దాడిచేసి ఆభరణాల చోరీ



దుండగుల దాడిలో గాయపడిన సుభద్ర

నల్లజర్ల: స్థానిక సెంటర్‌లో కాఫీ హోటళ్ల వెనుక నివసిస్తున్న మహిళ ఇంటిలోనికి నలుగురు దుండగులు వెళ్లి ఆమెపై రాళ్లతో దాడి చేసి దాదాపు 15 కాసుల బంగారు ఆభరణాలు దోచుకున్నారు. బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నల్లజర్ల జంక్షన్ సమీపంలో నివసిస్తున్న పాకలపాటి సుభద్ర ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఆమె కుమారుడు వెంకటరమేష్ అక్కడే ఉంటూ రాత్రి వేళ ఇదే గ్రామంలో ఉన్న అత్తవారింటికి వెళ్తూ ఉంటాడు. ఈ విషయం గమనించిన నలుగురు యువకులు మాస్కులు ధరించి బుధవారం అర్ధరాత్రి దాటాక ఆమె ఇంటి తలుపులు పగులగొట్టి ఆమెపై చిన్న,చిన్న రాళ్ళతో దాడిచేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారు గొలుసు, చెవి దుద్దులు, నాలుగు గాజులు సుమారు 15 కాసుల బంగారు ఆభరణాలు దోచుకున్నారు. అంతే కాకుండా ఆ గదిలోని బీరువాను పగులగొట్టి డబ్బు, బంగారం కోసం వెతికి బట్టలు చెల్లాచెదురు చేశారు. ఆమె చేతిలోని సెల్‌ఫోన్ లాక్కుని ఇంటి వెనుక నుంచి పరారయ్యారు. ఈ విషయాలన్నీ సమీపంలోని సీసీ కెమెరాలో నమోదయ్యాయి. అలాగే ఈ చోరీ జరిగిన ఇంటి పక్కన ఉన్న ఇద్దరి బైక్‌లను దుండగులు పట్టుకుపోయారు. ఈ షాక్ నుంచి తేరుకున్న సుభద్ర రహదారిపైకి వచ్చి ఒకరి సెల్‌ఫోన్ అడిగి తీసుకొని కుమారుడికి విషయం తెలియజేసింది. ఆయన ఫిర్యాదు మేరకు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, దేవరపల్లి సీఐ నాగేశ్వర నాయక్, నల్లజర్ల ఎస్ఐ దుర్గాప్రసాద్ సంఘటనా స్థలానికి వచ్చి ఆ రాత్రివేళే వివరాలు సేకరించారు. క్లూస్‌టీం సిబ్బంది నమూనాలు సేకరించారు. దుండగుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి.

మరో మూడు గేదెలకు మృత్యుపాశం



వ్యాధి సోకిన గేదెలకు చికిత్స అందజేస్తున్న అధికారులు

అంతు చిక్కని వ్యాధికి పశు సంపదను కోల్పోతున్న రైతులు

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవంలో గత కొద్ది రోజులుగా అంతు చిక్కని వ్యాధితో పాడి గేదెలు మృతి చెందుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వ్యాక్సిన్లు, మందులు వేస్తున్నప్పటికీ గురువారం మరో మూడు గేదెలకు వ్యాధి బారిన పడినట్టు రైతులు చెబుతున్నారు. గ్రామంలో ఇప్పటి వరకు 33 పాడి గేదెలు ఈ వ్యాధి బారిన పడ్డాయి. దీంతో ఆ సంఖ్య 36కు చేరింది. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు రామకృష్ణ ఉప సర్పంచ్‌తో గ్రామంలో వ్యాధి బారిన పడిన గేదెలను పరిశీలించారు. గేదెలు మృతి చెందడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. జిల్లా అధికారులు దీనిపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.